క్లుప్తంగా

దుండగులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ముస్లిం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ప్రకాశం జిల్లాలో మసీదులోని సామగ్రి దహనం చేసిన ఘటనలో దుండగులను కఠినంగా శిక్షించాలని ముస్లిం ఫెడరేషన్ నాయకులు సుహేల్‌రాజా, మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. ఈ అంశంపై శుక్రవారం నంద్యాలలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాళం వేసిన మసీదులోకి జొరబడటం దుర్మార్గమన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు అసాంఘిక శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర మంత్రి ఫరూక్ స్పందించి ఘటనపై విచారణ కమిటీ నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు జుబేర్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఖాజాహుసేన్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థి తండ్రికి నగదు అందజేస్తున్న ఎంపీపీ

ఉయ్యాలవాడ: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 24–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ప్రతిభ కనబరచిన లక్ష్మీ నరసింహ, మిద్దె ప్రతాప్, తలారి చందన విద్యార్థులకు బుడ్డా రామక్రిష్టారెడ్డి జ్ఞాపకార్థకంగా రూ.25 వేలు నగదు పురస్కారాలు అందజేశారు. ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, బుడ్డా ఈశ్వరరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. 7వ తరగతిలో ప్రతిభ కనబరచిన 5 మంది విద్యార్థులకు విశ్రాంతి పంచాయతీరాజ్ ఉద్యోగి మహబూబ్‌బాషా రూ. 5,200 నగదును విద్యార్థులకు అందజేశారు.

శ్రీకృష్ణ జన్మాష్టమికి ముస్తాబు



హరినగరం వద్ద వేడుకలకు సిద్ధమైన ఆలయం

రుద్రవరం: మండల పరిధిలోని హరినగరం సమీపంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నడుస్తున్న హరేకృష్ణ ఆలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు చంద్రశేఖర దాస్ తెలిపారు. ఆలయం వద్ద ఉట్టి కొట్టే ఉత్సవంతో పాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు,అన్నదానం తదితరవి నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైల గ్రామదేవత అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

అలరించిన హరికథ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై కడప జిల్లా మైదుకూరుకు చెందిన యడవల్లి రమణయ్య భాగవతార్ వారి 'భూకైలాస్' హరికథాగానం ఆకట్టుకుంది. కార్యక్రమానికి తబల సహకారాన్ని వై.ప్రసాద్‌బాబు, హార్మోనియం సహకారాన్ని కె.వీ రభద్రుడు అందించారు.

రమేష్ యాదవ్ పోరాటం స్ఫూర్తిదాయకం

మహానంది: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పోరాటం స్ఫూర్తి దాయకమని పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పుల్లయ్య యాదవ్ అన్నారు. ఇటీవల రమేష్ యాదవ్‌పై దాడి జరగడంతో ఆయనను శుక్రవారం పొద్దుటూరులో కలిసి పరామర్శించి వచ్చారు. ఈసందర్భంగా పుల్లయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్న రమేష్ యాదవ్‌పై దాడి జరగడం బాధాకరమన్నారు.



ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



శిరివెళ్ల ఎంపీడీఓ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం



రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



హోలీక్రాస్ కెథడ్రల్ ఆలయం ఎదురుగా జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న బిషప్ సంతోష్ ప్రసన్నరావు



రుద్రవరంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మురిసిన మువ్వన్నెల జెండా

- నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, సహకార సంఘాలు, పోలీసు స్టేషన్లు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల కార్యాలయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. జెండా ఆవిష్కరణ అనంతరం మిఠాయిలు పంచుకొని పంద్రాగస్టు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎందరో మహనీయుల త్యాగ ఫలమే స్వాతంత్ర్యమే అని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.

- ఆళ్లగడ్డలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రత్నకుమారి జాతీయ జెండాను ఎగురవేశారు. సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ఆళ్లగడ్డలో ర్యాలీ నిర్వహించారు.
- రుద్రవరంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ బాలస్వామి, రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ మల్లిఖార్జునరావు, శిరివెళ్లలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, తహసీల్దార్ కార్యాలయంలో జయశ్రీ, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ చిన్న పీరయ్య, విద్యుత్ కార్యాలయంలో సిబ్బంది, కేడీసీసీ బ్రాంచిలో మేనేజర్ రేణుకాదేవి, స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో సర్పంచు సాలమ్మ, యర్రగుంట్లలో సర్పంచు అయ్యలూరి సుభాహాన్, జీటీఆర్ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులు, ఇంద్రాణి, దొర్నిపాడు మండలంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సుభద్ర, ఎంపీడీఓ సావిత్రి, సర్పంచులు లక్కు మాధవీచంద్రశేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు డబ్ల్యూ కొత్తపల్లె పీహెచ్‌సీలో వైద్యాధికారి ఉసేన్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.
- చాగలమర్రి మండలంలో ఎంపీడీఓఓ కార్యాలయం వద్ద ఎంపీపీ వీరభద్రుడు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు విజయ్ కుమార్, పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ పవన్‌కుమార్, చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తోలసమ్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌ఓ రవణమ్మ, చక్రం కాంప్లెక్స్ వద్ద నున్న స్వర్ణకారుల సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు డి.గౌస్‌బాషా, జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ ముల్లా మహబుబ్‌బాషా జాతీయ పతాకాన్ని ఎగుర వేసి స్వాతంత్ర సమరయోధుల వీరోచిత పోరాటాన్ని వివరించారు.
- ఉయ్యాలవాడ మండలంలో రెవెన్యూ కార్యాలయంలో తలసీల్దార్ సువర్ణాదేవి, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రామిరెడ్డి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ చెన్నయ్య జాతీయ జెండాను ఎగుర వేసి గౌరవ వందనం చేశారు. అంతకు ముందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలదాత పాలూరు సుబ్బరాయుడు శ్రేష్టి విగ్రహానికి ఎంపీపీ, విశ్రాంత ఉపాధ్యాయుడు గుండం సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు విజయకుమార్, పోచా శ్రీనివాస రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఎస్పీ కార్యాలయ ఆవరణలో జెండా ఎగురవేస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

నంద్యాల: సాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్ పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో జెండా ఎగుర వేసి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

జిల్లా కోర్టు ఆవరణలో

నంద్యాలలోని జిల్లా కోర్టు ఆవరణలో మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి , ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఏసురత్నం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్ బాషా, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, ముక్కెర క్రిష్ణారెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల నియోజకవర్గంలో..

నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ శేష ఆధ్వర్యంలో జెండా వందన కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ కార్యాలయం వద్ద డీఈఓ సుధాకర్‌రెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శశికళ, ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కార్యాలయంలో డీఐఈఓ శంకర్‌నాయక్, గురురాజ పాఠశాలలో డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, మౌలాలిరెడ్డి, శాంతినికేతన్‌లో సుధాకర్, సమతా విద్యానికేతన్ కరస్పాండెంట్ బాలచంద్రుడు, పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో ఇన్‌చార్జి శ్రీధర్,ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్ఎం రజియా సుల్తానా, హెడ్‌పోస్టాఫీసులో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ విజయేంద్ర, బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ఎస్‌డీపీఐ కార్యాలయంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ హఫీజ్ హతావుల్లాఖాన్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, సీపీఐ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సీపీఎం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, హోలీక్రాస్ కెథడ్రల్ ఆలయం ఎదురుగా, ఎస్పీజీ కళాశాల ఆవరణలో నంద్యాల డయాసిస్ అధ్యక్షుడు (బిషప్) సంతోష్ ప్రసన్నరావు జాతీయ జెండాను ఎగురవేశారు. నంద్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రభాకర్, విద్యుత్ కార్యాలయంలో ఎస్ఈ సుధాకర్ కుమార్, ఐసీడీఎస్‌లో సీడీపీఓ చంద్రకళ, ఆర్ఏఆర్ఎస్‌లో ఏడీఆర్ విల్సన్, శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణంలో డీఏఓ వెంకటేశ్వర్లు, రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయ ఆవరణలో రైతు సంఘం నాయకులు రామచంద్రా రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, సర్వజన ఆసుపత్రి వద్ద సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, మెడికల్ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, గోస్పాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ ఆర్థర్‌సైమాన్, ఎంపీడీఓ అమానుల్లా, తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ హరిత, పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఐ సుధాకర్‌రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.



అమ్మిరెడ్డిరెడ్డినగరంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ లతమాధవి



ఆళ్లగడ్డలో సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో



కోర్టు ఆవరణలో జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు



నంద్యాల డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ..



మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా



25వ వార్డు సచివాలయం వద్ద వేడుకల్లో కౌన్సిలర్ కృష్ణమోహన్



ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాలలో ...



చాగలమర్రిలో సీనియర్ స్వర్ణకారుల సన్మాన దృశ్యం



ఆళ్లగడ్డలో జెండా ఆవిష్కరణలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ప్రజా సమస్యలపై పోరాటం

నంద్యాల(న్యూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతామని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సాయిబాబానగర్‌లో ఏర్పాటు చేసిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో పేద ప్రజలందరికీ రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఇళ్లు నిర్మించేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల హామీల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించిందన్నారు. అయితే, ఇప్పటి వరకు అతీగతీలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రసాద్, సోమన్న, బాబాఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

సమాచార హక్కు చట్టంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు తెలిపారు. సమాచార హక్కు చట్టం గురించి తెలియజేస్తూ శుక్రవారం సహకార సంఘ ఉద్యోగులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కార్యాలయం ఎదుట సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం లాంటిదన్నారు. ప్రభుత్వ శాఖలన్నింటి నుంచి ఈ చట్టం ద్వార మనకు కావాల్సిన సమాచారం సేకరించుకోవచ్చాన్నారు. ప్రజలు ఈచట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్థానిక అలంకార మండపంలో మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. గణపతి పూజ, అలంకార హారతులు ఇచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు.

స్త్రీ శక్తి పథకం ప్రారంభించిన మంత్రి

నంద్యాల(వ్యవసాయం): మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన స్త్రీ శక్తి పథకాన్ని శుక్రవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. నంద్యాల బస్టాండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, మహిళలతో కలిసి నంద్యాల–బనగానపల్లె బస్సు సర్వీసులో ప్రయాణం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎం రజియాసుల్తానా, ఇన్‌చార్జి డిపో మేనేజర్ వినోద్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



గుర్రాల వెంకటేశ్వరి(ఫైల్)

సంజామల: నొస్సం గ్రామానికి చెందిన గుర్రాల చెన్నయ్య కుమార్తె అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గుర్రాల చెన్నయ్య రెండో కుమార్తె గుర్రాల వెంకటేశ్వరి శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు పలుచోట్ల విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రైల్వేలైన్ కాపర్ వైర్ చోరీ

కొలిమిగుండ్ల: సంజామల వద్ద నుంచి కల్వటాల సమీపంలో రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వరకు జరుగుతున్న రైల్వేలైన్ నిర్మాణ పనుల వద్ద ఉన్న కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు సీఐ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. కొద్ది రోజుల నుంచి రైల్వేలైన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. గత నెల 15న రాత్రి సమయంలో రైల్వే లైన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు 425 మీటర్ల కాటేనరి కాపర్ వైర్, 306 మీటర్ల కాంటాక్టు కాపర్ వైర్‌ను దొంగలు అపహరించకపోయారు. వాటి విలువ రూ.8 లక్షలు ఉంటుందన్నారు. త్రిమూర్తి హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెని సూపర్ వైజర్ ముక్కే వెంకటనాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఎరువుల కొరత లేకుండా చూస్తాం

ఉయ్యాలవాడ : సొసైటీ పరిధిలోని రైతులందరికీ ఎరువుల కొరత లేకుండా చూస్తామని ఉయ్యాలవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంనూతన చైర్మన్ బోరెడ్డి దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సొసైటీ చైర్మన్‌గా బోరెడ్డి దస్తగిరిరెడ్డి, డైరెక్టర్లుగా శింగిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎగ్గోని రఘునాథరెడ్డి నియామకం కావడంతో సీఈఓ మౌళాలి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే రైతులకు యూరియా, తదితర రసాయనిక ఎరువులు అందుబాటులో లేవని తమ దృష్టికి వచ్చిందన్నారు. సహకార సంఘం సిబ్బంది, ఉన్నతాధికారుల సహకారంతో అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు.



ఉయ్యాలవాడ సొసైటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న బోరెడ్డి దస్తగిరిరెడ్డి

మాజీ సైనికులకు ఉచిత న్యాయసేవలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని మాజీ సైనికుల చట్టబద్ధమైన సమస్యలను పరిష్కరించేందుకు ఉచిత న్యాయ సేవలు అందించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ.కబర్ధి చెప్పారు. శుక్రవారం స్థానిక సీ క్యాంప్‌లోని జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయంలో మాజీ సైనికుల కోసం నల్సా వీర్ పరివార్ సహాయత యోజన – 2025లో భాగంగా లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బీ.లీలా వెంకటశేషాద్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జీ.కబర్ధి మాట్లాడుతూ ఈ క్లినిక్‌లో న్యాయవాదితో పాటు ప్యారా లీగల్ వలంటీరు కూడా ఉంటారన్నారు. లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ.. మాజీ సైనికులందరు ఉచిత న్యాయ సేవలకు అర్హులన్నారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్ఆర్ రత్నరూత్, న్యాయవాది హేమలతారెడ్డి, పారా లీగల్ వలంటీరు మధుసూదన్, మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.



బురదలో కూరుకు పోయిన వరి నాట్లు



దెబ్బతిన్న మొక్కజొన్న పైరు

పశువుల దాడిలో పంటలు ధ్వంసం

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరానికి సమీపాన ఉన్న పొలాల్లో విచ్చల విడిగా పశువులు తిరుగుతుండటంతో రైతులు సాగు చేసిన పంటలు ధ్వంసమవుతున్నాయి.తెలుగుగంగ ప్రధాన కాల్వకు వెళ్లే దారికి ఇరువైపులా ఉన్న పొలాల్లో రైతులు వందలాది ఎకరాల్లో మొక్కజొన్న, వరి నాట్లు వేశారు. గత కొద్ది రోజులుగా గ్రామంలోని పలువురు రైతులకు చెందిన ఆవులు, దున్నలు రాత్రి సమయాల్లో మేత కోసం పొలాల్లోకి వెళ్లి పైర్లను తొక్కుతూ నాశనం చేస్తున్నాయి. దీంతో తమ పంటలు దెబ్బతింటున్నాయని బాధిత రైతులు శుక్రవారం రాత్రి ఎస్ఐ మహమ్మద్ రఫికి ఫిర్యాదు చేశారు.